KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 178 | శుక్రవారం 30 మే 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

# బిఆర్ఎస్‌ను బీజేపీలో కలిపే కుట్ర



2 లో

● నాకు నీతులు చెప్పేవారికి పార్టీ నడిపించే సత్తా లేదు ● అంతర్గత విషయాలతో నేను లేఖ రాస్తే బయటపెట్టింది ఎవరు? ● ట్వీట్లు వేస్తే సరిపోతుందా? ● పార్టీని బలోపేతం చేసే తీరు ఇదేనా? ● కడుపులో బిడ్డ ఉండగా తెలంగాణ కోసం కొట్లాడాను ● జైల్లో ఉండగా.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం చేయొద్దని గట్టిగా చెప్పాను ● లీకు వీరులను బయటపెట్టమంటే.. గ్రీకువీరుల్లా నాపై దాడి చేస్తున్నారు ● డబ్బులిచ్చి మరీ నన్ను తిట్టిస్తున్నారు ● కాంగ్రెస్‌తో 2013లో చివరిసారిగా మాట్లాడా.. అది మునిగిపోయే నావ ● కేసీఆర్ లాగా తిక్కదాన్ని.. ఎవరికీ భయపడను ● బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాకు నాయకుడు ● వెన్నుపోటు రాజకీయాలు తెలియవు -

\- ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాసిన లేఖ.. తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. లేఖ బయటకు రావడంతో.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలున్నాయనే వాదన తెర మీదకు వచ్చింది. ఇదిలా ఉండగా.. లేఖ వివాదంపై తాజాగా చేసిన చిట్‌చాట్‌లో కవిత స్పందిస్తూ.. మరింత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను లేఖ రాసింది తన తండ్రికే అని.. అది కూడా పార్టీ బలోపేతం కోసమే అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరో వంద లేఖలు రాస్తానని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 'చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్ట్‌లను వ్యతిరేకించలేదు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు.. బాబు, రేవంత్‌తో భేటీ తర్వాతనే తెర మీదకు వచ్చింది. ఈ అంశంలో ప్రభుత్వంపై ఒత్తడి తేవాలి.. నీటిపారుదల శాఖపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తాం' అని చెప్పుకొచ్చారు.

### కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నిరసన కార్యక్రమాలు చేయలేదు ఎందుకు?

బీఆర్ఎస్ పార్టీలో తనకు నీతులు చెబుతున్న వారు.. కేసీఆర్‌కి కాళేశ్వరం నోటీస్‌లు ఇస్తే పార్టీ పరంగా ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేయలేదు ఎందుకు అని ప్రశ్నించారు. తన మీద పడి విమర్శలు చేసి..పెయిడ్ వార్తలు రాయిస్తే ఏం వస్తుందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఓ పత్రిక తనపై తప్పుడు వార్తలు రాస్తుందని.. తన మీద కుట్రతోనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆమె మండి పడ్డారు. బీఆర్ఎస్ పార్టీలోని ఎంపీల్లో కొందరు కోవర్టులున్నారని.. వారే తనను ఓడగొట్టారంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

### రాజీనామా చేస్తా అంటే కేసీఆర్ వద్దన్నారు

'ఎమ్మెల్యేలు నా గెలుపు కోసం పని చేయలేదు.. అందుకే అదే జిల్లాలో ప్రోటోకాల్ ఉండాలనే.. కేసీఆర్ నాకు ఎమ్మెల్సీ ఇచ్చారు. నేను ఎప్పుడూ పదవులు అడగలేదు. ఒక్క కేసీఆర్ తప్ప ఇప్పుడు నన్ను విమర్శిస్తున్నవారు ఏం చేశారో చెప్పాలి. నేను మంచిదాన్ని కాదు.. నాతో పెట్టుకోవద్దు. నన్ను అరెస్ట్ చేసే సమయంలోనే కేసీఆర్ వద్దకు వెళ్ళి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా అని అడిగాను. అప్పుడాయన నాపై కుట్రతో నిన్ను అరెస్ట్ చేస్తున్నారని చెప్పారు. పార్టీ చేయలేని పనులు జాగృతి తరుపున నేను చేస్తున్నాను. కేవలం ట్వీట్‌లు పెడితే సరిపోతుందా' అని ప్రశ్నించారు.

నాకు నీతులు చెప్పేవాళ్ళు కొందరు బీజేపీతో, కొందరు కాంగ్రెస్‌తో ఉన్నారు. పార్టీ బలోపేతం కోసం వారు ఏం చేస్తున్నారు. సభ సక్సెస్ చేసింది కేసీఆర్. మా నాన్నకు లేఖ రాశాను.. పార్టీ కోసమే రాశాను.. వంద లేఖలు రాస్తా.. బీజేపీని కట్టడి చేయకుండా బీఆర్ఎస్‌ని.. కాషాయ పార్టీలో విలీనం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

## గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రకటన..

● 2024 ఉత్తమ చిత్రంగా 'కల్కి'




2 లో

## కఠిన చర్యలు తప్పవు..



2 లో

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, వానాకాలం సాగు, విత్తనాలు, ఎరువులు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. వారి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇటీవల వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తగిన మద్దతు ధర కల్పించడంలో కలెక్టర్లు చూపిన చొరవ అభినందనీయమని ప్రశంసించారు.

## కవిత మాట్లాడినది నిజమే.. పెద్ద ప్యాకేజీ దొరుకుతే కలిసిపోతారు..!



తెలంగాణ పాలిటిక్స్‌లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు.

2 లో

## మేము రెడీ.. వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా..? : దీదీ సవాల్



2 లో

పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం మిగిలి ఉండగానే రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ , సీఎం మమతా బెనర్జీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. తనపై మోదీ చేసిన విమర్శలకు స్పందించిన దీదీ.. ఎన్నికలు వెంటనే నిర్వహించగలరా అంటూ సవాల్ విసిరారు.



● మోడీలో ధైర్యం లేదు.. యుద్ధం అర్ధాంతరంగా ఆపేశారు ● పీవోకే స్వాధీనం చేస్తే సమస్యలన్నీ పరిష్కారం" - జైహింద్ ర్యాలీలో సీఎం వ్యాఖ్యలు ● దేశ భద్రత మోడీ సొంతం కాదు - అది 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవం ● ట్రంప్‌కు భయపడి యుద్ధం ఆపేశాడు మోడీ" - సంచలన వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్

## గుండెల్లో దమ్ము, ధైర్యం ఉన్నోడే యుద్ధంలో గెలిపిస్తాడు..

తనపై కుట్ర చేసి 2018 ఎన్నికల్లో ఓడించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బాచుపల్లిలో భారత సైన్యానికి మద్దతుగా 'జైహింద్ ర్యాలీ' నిర్వహించారు. ఈ సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 2018లో కొడంగల్‌లో కుట్ర చేసి ఓడించినా.. ఆ వెంటనే మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా గెలిపించి తనను లోక్‌సభకు పంపించారని అన్నారు. ఇవాళ నేను సీఎంగా ఉన్నానంటే కార్యకర్తల కఠోర శ్రమే అని తెలిపారు. కార్యకర్తలు వారి చెమటను రక్తంగా మార్చి తనను గెలిపించారని అన్నారు. పెహల్గాంలో మన దేశ పౌరులపై తూటాలు పేల్చిన దేశాన్ని తుడిచేయాలని ప్రధాని మోడీని అనేక సార్లు కోరాం.. దేశ భద్రత విషయంలో అంతా ఒక్కటే అని సంకేతాలు ఇచ్చామని తెలిపారు. పాకిస్తాన్ కు మోడీ తగిన గుణపాఠం చెబుతారనే ఉద్దేశంతోనే మద్దతిచ్చాం.. కానీ నాలుగు రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ.. అర్ధాంతరంగా యుద్ధం ఆపేశారు. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి స్వయంగా తానే యుద్ధం ఆపానని ప్రకటించుకున్నారు.

2 లో



## భూమిలేని రైతులకు గుడ్‌న్యూస్..

● జూన్ 2న పట్టాలు పంపిణీ ● ధరణి లో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దు ● ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు జరగొద్దు ● చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలి ● రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దు ● ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు ● రెవెన్యూ లో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దు - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2 లో

## బీజేపీ స్టేట్ ఫైట్ చేస్తుంది గాని స్ట్రీట్ ఫైట్స్ చేయదు



2 లో

● నీచ రాజకీయాలు బీజేపీకి రాదు - కేసీఆర్ నేర్పినవే ట్యాపింగ్, విభేదాలు ● తెలంగాణ అప్పుల ఊబిలో - భాజపా అధికారంలోకి రావాలి ● ఫోన్లు ట్యాప్ చేయడం నేరం.. ● నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు కేసీఆర్ కుట్ర ఫలితం ● కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతా - బాధ్యతాయుతంగా వ్యవహరిస్తా - ఎంపీ ఈటల

## నేటి మాట

"ఒకరి కాలి కింద బానిసలా.. నీచంగా బతికే బదులు లేచి నిలబడి ప్రాణం విడిచిపెట్టడం మేలు"



\- చే గువేరా



## మీ రుణం తీర్చుకుంటా

మహానాడు గ్రాండ్ సక్సెస్..

కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కడప టీడీపీ మహానాడు బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా జై తెలుగుదేశం అని కార్యకర్తలతో చెప్పించారు ముఖ్యమంత్రి. రాయలసీమ గర్జన రాష్ట్రం అంతా మారుమ్రోగాలన్నారు. జనసంద్రంగా కడప నిండిపోయిందన్నారు. ఎన్నోసార్లు కడపకు వచ్చానని.. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ మహానాడుకు రావడం చూసి కొండంత ధైర్యం వచ్చిందన్నారు. కడపలో మహానాడు పెడితే చాలామంది అనుమానించారని సీఎం తెలిపారు. కానీ కడప టీడీపీ అడ్డా అని నిరూపించేందుకే మహానాడు ఇక్కడ పెట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు దేవునిగడపలో జరిగిందని.. రెస్పాన్స్ అదిరిందన్నారు. మహానాడు సూపర్ హిట్ అయ్యిందని అన్నారు. కడప రాజకీయం మారబోతోందని.. కడప గడపలో మార్పు కనిపిస్తుందని గత ఎన్నికల ప్రచారంలో చెప్పానన్నారు. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారని కొనియాడారు.

2 లో

## 10 ఏళ్లు వెనుకపడ్డాం.. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు

● 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసింది ● ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది ● వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్‌కి వేశాం : భట్టి విక్రమార్క



2 లో

ఖమ్మం జిల్లాలో అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవపై కీలక వ్యాఖ్యలు చేశారు. సమావేశాన్ని చాలా ప్రత్యేకమైనదిగా పేర్కొన్న భట్టి, జిల్లాల ఇంచార్జి మంత్రులు అన్ని ప్రాంతాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. భట్టి ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కొనుగోలు చేసింది.

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# బిఆర్ఎస్ ను బీజేపీ లో కలిపే కుట్ర

మొదటి పేజీ తరువాయి

నేను జైల్లో ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదనను నా దగ్గరకు తెచ్చారు. నేను వద్దన్నాను. చంద్రబాబు ద్వారా మమ్మల్ని కలవాలని ప్రయత్నించారు. నేను అందుకు ఒప్పుకోలేదు. కావాలంటే మరో ఏడాదంతా జైల్లోనే ఉంటాను. కానీ బీఆర్ఎస్‌ని బీజేపీలో విలీం చేయవద్దని కోరాను' అని చెప్పుకొచ్చారు.

'నేను రాసిన లేఖను బయట పెట్టిన వారు ఎవరు.. నా పై వార్తలు రాపిస్తున్న దూతలు ఎవరు.. నేను సూటిగా మాట్లాడతా. వెన్ను పోటు రాజకీయాలు చేయను. లేఖ లీక్ పై పార్టీ సమాధానం చెప్పాలి.. కాంగ్రెస్ పార్టీ తో నేను టచ్‌లో ఉన్నానని అబద్ధపు రాతలు రాస్తున్నారు.. దేశంలో, రాష్ట్రంలో అది మునిగిపోయే పడవ. అలాంటి పార్టీలోకి నేను ఎందుకు వెళ్తాను' అని కవిత ప్రశ్నించారు.

# కవిత మాట్లాడినది నిజమే.. పెద్ద ప్యాకేజీ దొరుకుతే కలిసిపోతారు..!

తెలంగాణ పాలిటిక్స్‌లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు.

"ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కైపోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగింది" అని రాజాసింగ్ అన్నారు. "ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. "చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారు" అని ఆయన వాపోయారు.

# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రకటన..

ఉత్తమ మొదటి చిత్రం –కల్కి
ఉత్తమ రెండో చిత్రం – పొట్టేల్
ఉత్తమ మూడో చిత్రం –లక్కీ భాస్కర్
ఉత్తమ బాలల చిత్రం–35 ఇది చిన్న కథ కాదు
ఉత్తమ ఫీచర్ హెరిటేజ్ అవార్డు–రజాకార్
ఉత్తమ నటుడు – అల్లు అర్జున్ (పుష్ప–2)
ఉత్తమ దర్శకుడు – నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ నటి – నివేదా థామస్ (35 ఇది చిన్న కథ కాదు)
ఉత్తమ గాయని – శ్రేయా ఘోషల్ (పుష్ప–2)
ఉత్తమ స్క్రీన్ ప్లే–వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ హాస్యనటులు – వెన్నెల కిషోర్, సత్య
ఉత్తమ కొరియోగ్రాఫర్ – గణేష్ ఆచార్య (దేవర)
ఉత్తమ కథా రచయిత – శివ పాలడుగు
ఉత్తమ పుస్తకం – రెంటాల జయదేవ్ (మన సినిమా పుస్తకం)
స్పెషల్ జ్యూరీ అవార్డు – అనన్య నాగళ్ల (పొట్టేల్)
స్పెషల్ జ్యూరీ – దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
స్పెషల్ జ్యూరీ – ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా–2)

జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం. 2014–23సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామని అన్నారు.

# మేము మా పార్టీలో కంఫర్ట్‌గా ఉన్నాం.. మంత్రి పొన్నం ఆసక్తికర వ్యాఖ్యలు




తెలంగాణ కాంగ్రెస్ పై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై మాట్లాడే హక్కు, అర్హత రెండూ కవితకు లేవని విమర్శించారు. తమ పార్టీలోని నేతలంతా సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. మా పార్టీలో మేము చాలా కంఫర్ట్‌గా ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ అంతర్గత విషయాలను ముందు క్లియర్ చేసుకోవాలి.. దమ్ముంటే తన లేఖలు ఎలా బయటకు వచ్చాయో, ఎవరు బయటకు తెచ్చారో కవిత చెప్పాలని హితవు పలికారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తోన్న ఆదరణ చూసి తట్టుకోలేక ఈ తరహా ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, రూ.500లకు గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసంతో ఆర్థిక చేయూత ఇలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజల్లో వస్తోన్న ఆదరణ చూసి బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే అని.. ఆ రెండు పార్టీలతో తెలంగాణను ఎప్పటికీ ప్రమాదమే అని కీలక వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు.. తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. లేఖ బయటకు రావడంతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలున్నాయనే వాదన తెర మీదకు వచ్చింది. తాజాగా చేసిన చిట్‌చాట్‌లో కవిత మరింత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను లేఖ రాసింది తన తండ్రికే అని.. అది కూడా పార్టీ బలోపేతం కోసమే అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరో వంద లేఖలు రాస్తానని.. కానీ ఈ లేఖ ఎలా బయటకు వచ్చిందో తెలియాలని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# కఠిన చర్యలు తప్పవు.. మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి




నకిలీ విత్తనాల మాఫియాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ మండలంలో విత్తనాల తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతుల భద్రత కోసం ప్రభుత్వం నిబద్ధతగా పనిచేస్తోందని చెప్పారు. రూ. 22,000 కోట్లతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా 4.5లక్షల కుటుంబాల సొంతింటి కలలు సాకార అవుతుందని అన్నారు. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు దక్కాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను అధికారులు ర్యాండమ్‌గా చెక్ చేయాలన్నారు. నకిలీ విత్తనాలుపై తీసుకుంటున్న చర్యలను వెంటనే పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పనులు 200 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

# మేము రెడీ.. వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా..?: దీదీ సవాల్

మొదటి పేజీ తరువాయి

అలీపుర్‌దుర్‌లో భాజపా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రధాని మోదీ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇక్కడ ప్రజలపై దయలేని ప్రభుత్వం కొనసాగుతోందని.. రాష్ట్రంలో హింస జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు.మార్పు కావాలని బెంగాల్ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

"టీచర్ నియామకాల్లో కుంభకోణం జరిగింది. వేలాది మంది కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బెంగాల్ విద్యావ్యవస్థ నాశనం అయింది. టీఎంసీ నేతలు ఎన్నో నేరాలు చేశారు. కానీ, వారి తప్పులను అంగీకరించడానికి బదులుగా న్యాయవ్యవస్థలు ఇచ్చిన తీర్పులను తప్పు పడుతున్నారు. పేదల హక్కులు హరిస్తున్నారు. నిరుద్యోగంతో రాష్ట్ర యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇకనైన బుజ్జగింపు రాజకీయాలు, గూండాయిజానికి స్వస్తి పలకండి" అని మోదీ హితవు పలికారు. ఆయన వ్యాఖ్యలపై స్పందించిన దీదీ అసహనం వ్యక్తం చేశారు.

"పహల్గాం ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాం. మేమంతా ఒక్కటే, ఉగ్రవాదాన్ని సహించేది లేదు, ఐక్యతే మా బలం అనే సందేశాన్ని తెలియజేయడానికి అఖిలపక్ష ప్రతినిధులు విదేశాలల్లో పర్యటిస్తున్న సందర్భంలో ప్రధాని మోదీ ఈ విధంగా మాట్లాడడం బాధాకరం. ఆయన నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం నన్ను ఆశ్చర్యానికి గురి చేశాయి. బెంగాల్ ప్రజలు నా వెంట ఉన్నారు. టీఎంసీకే వారి మద్దతు. అసెంబ్లీ ఎన్నికలను వెంటనే నిర్వహించండి" అని సవాల్ విసిరారు.

# గుండెల్లో దమ్ము, ధైర్యం ఉన్నోడే యుద్ధంలో గెలిపిస్తాడు..

మొదటి పేజీ తరువాయి



అసలు యుద్ధం ఆపే ఆలోచన ఉన్నప్పుడు అఖిలపక్షంతో ఎందుకు చర్చించలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధంలో గెలిపిస్తాడని కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇందిరా గాంధీ తన ధైర్య సాహసాలను చూపించింది. పాకిస్తాన్‌కు చుక్కలు చూపించింది. చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టిందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. కానీ.. మోడీ ఇందుకు భిన్నంగా ప్రవర్తించారని విమర్శించారు. ట్రంప్‌కు భయపడి యుద్ధం ఆపేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత అనేది ప్రధాని మోడీ సొంత నిర్ణయం కాదని అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్‌కు మోడీ తాకట్టు పెట్టాడని మండిపడ్డారు. పీవోకే స్వాధీనం చేసుకుంటనే సమస్యలన్నీ సాల్వ్ అవుతాయని.. తమతో పాటు దేశం మొత్తం ముక్త కంఠంతో చెప్పింది.. అయినా కేంద్రం వినలేదు. బెలూచిస్తాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయాలని కోరాం.. అయినా పెడచెవిన పెట్టారని తీవ్ర విమర్శలు చేశారు. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడం చేతకాదు కానీ.. కాంగ్రెస్‌పై మాత్రం విమర్శలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి రెచ్చిపోయారు.

# మీ రుణం తీర్చుకుంటా
## సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఈ ఎన్నికల్లో కడపతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అద్భుతమైన విజయం సాధించామన్నారు. ఉమ్మడి కడపలో పదికి ఏడు స్థానాలు గెలిచామని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి కష్టపడితే 2029 ఎన్నికల్లో పదికి పదికి స్థానాలు గెలుచుకుంటామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, 52 సీట్లకు 45 సీట్లతో కూటమిని గెలిపించారన్నారు. వైసీపీకి రాయలసీమలో ఏడు సీట్లు వస్తే టీడీపీ కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే ఏడు సీట్లతో గెలిపించారన్నారు. ఈ తీర్పును మనం అర్థం చేసుకున్నామని.. కానీ ఓడిపోయిన పార్టీ ఇంకా అర్థం చేసుకోలేదని మండిపడ్డారు. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



**అలాంటి వారు ఉండటం పార్టీకి అదృష్టం**

అవమానాలు, అక్రమ కేసులు, నిర్బంధాలు అన్నింటినీ ఎదుర్కొన్నారని.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే అది కార్యకర్తలు, నేతలు త్యాగాలే అని తెలిపారు. మెజార్టీలు అత్యధికంగా వచ్చాయన్నారు. ఏడాది క్రితం రాష్ట్రం విధ్వంస పాలనతో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని విమర్శించారు. 'కష్టాలు, సవాళ్లను చూసి నేను భయపడలేదు. నేను క్లైమోర్ మైన్‌లకు భయపడలేదు. వీటికి భయపడతానా' అని ప్రశ్నించారు చంద్రబాబు. సైకిళ్లు వేసుకుని కడప మహానాడుకు వచ్చారంటూ.. కోడూరు నుంచి సైకిల్ వేసుకుని వచ్చిన వ్యక్తిని సభా వేదికపై సీఎం చూపించారు. ఇటువంటి కార్యకర్తలు ఏ పార్టీకైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఇటువంటి కార్యకర్తలు ఉండటం పార్టీకి అదృష్టం అని అన్నారు.

**భూసమస్య లేకుండా చేస్తా**

అన్న క్యాంటీన్లు తెరవడం, రోడ్లు బాగుచేయడం, పెన్షన్లు 4 వేలు చేయడం, దేవాలయాల్లో అన్నదానం ప్రారంభం విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్ర పథకాలు నిధులు డైవర్ట్ చేశారని మండిపడ్డారు. తాను వెంటనే పథకాలను పునరుద్ధరించానని తెలిపారు. తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ అని.. బీసీల కోసం బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు పెట్టామని చెప్పారు. పలు బీసీ వర్గాలకు ఇచ్చిన పథకాలను సీఎం గుర్తుచేశారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ గా సోలార్ విద్యుత్ ఇస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పంపు సెట్లు వద్ద సోలార్ విద్యుత్ పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ఉద్యోగులను గత ప్రభుత్వం అవమానాలకు గురి చేసిందని.. కానీ ఇప్పుడు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని తెలిపారు. వారికి ఇప్పటికే రూ.7 వేల 500 కోట్లు బకాయిలు ఇచ్చామన్నారు. కూటమి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేశామని తెలిపారు. రాబోయే మహానాడుకు భూ సమస్యలు లేకుండా చేస్తానంటూ ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు.

**ఇక్కడ ఉంది సీబీఎన్.. గుర్తుపెట్టుకోండి**

దేశానికి టెర్రరిస్టుల వలన చాలా నష్టం జరుగుతోందన్నారు. మన దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదులు వలన నష్టం కలుగుతోందన్నారు. నాసిరకం మద్యం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తాయని అన్నారు. గంజాయ్ వలన అనేక మంది భవిష్యత్ నాశనం అయిందని అన్నారు. అడవులను ఆక్రమించుకొని ఎస్టేట్‌లు కడతారని ఫైర్ అయ్యారు. 'ఆర్థిక ఉగ్రవాదులు గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తా. డ్రగ్స్ అమ్మే వారికి అదే చివరి రోజు అవుతుంది. ఇక్కడ ఉంది సీబీఎన్ అని గుర్తు పెట్టుకోండి' అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# భూమిలేని రైతులకు గుడ్‌న్యూస్.. జూన్ 2న పట్టాలు పంపిణీ

జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు.

గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాలలో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేదు.. ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఎ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

# బీజేపీ స్టేట్ ఫైట్ చేస్తుంది గాని స్ట్రీట్ ఫైట్స్ చేయదు



తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు. నీచ రాజకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. తెలంగాణ వెలవెలబోతోంది. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలి. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతా" అని ఈటల తెలిపారు.

"భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో ఆపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా?" అని ఈటల ప్రశ్నించారు.

# 10 ఏళ్లు వెనుకపడ్డాం.. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు

మొదటి పేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఇందులో ముందంజలో ఉన్నాయని కొనియాడారు. ఇకపై ధరలు చెల్లింపులు వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో 2–3 నెలలు ఆలస్యం అయ్యేదని గుర్తుచేశారు.

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దేశంలో ఎక్కడ లేనంతగా ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల మేర శాంక్షన్ చేయడం గర్వకారణంగా పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళు కేటాయించడం గొప్ప ముందడుగని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,56,000 ఇళ్లకు నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిపారు. కొన్ని చిన్నపాటి పొరబాట్లు మినహా ఈ మంచి కార్యక్రమాన్ని చెడుగా మలచకూడదని అధికారులకు సూచించారు.

భూ హక్కులపై ప్రభుత్వ దృష్టిని స్పష్టం చేసిన భట్టి, "భూ భారతి పథకాన్ని 10 ఏళ్లు చూశాం. ధరణి ద్వారా ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులు లభించాయి. దాన్ని తొలగిస్తామని ఎన్నికల హామీ ఇచ్చాం. దానిని అమలుచేయడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేస్తున్నారు" అని చెప్పారు.

విత్తనాల పంపిణీ సక్రమంగా జరగాలని, నకిలీ విత్తనాలపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. తాగునీరు లీకేజీలపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. "గతంలో ప్రభుత్వాలు విభాగాలను గాలికి వదిలేశాయి. కానీ ప్రస్తుతం బడ్జెట్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు, నిధులు విడుదల చేస్తాం" అన్నారు. "10 ఏళ్లు వెనుకపడ్డాం. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు. లక్ష్యాలను చేరుకోవాలంటే ఇదే మార్గం" అంటూ భట్టి స్పష్టమైన సందేశం ఇచ్చారు.

# కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసింది: భారాస నేత వినోద్




రాజకీయాల్లో ప్రకంపనలు సహజమని, చాలా పార్టీలో ఇలాంటి ప్రకంపనలు చూశామని మాజీ ఎంపీ, భారాస నేత వినోద్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఇలాంటి విషయాల్లో తమ పార్టీ మొదటిది కాదు.. చివరిది కాదని వ్యాఖ్యానించారు. భాజపాతో పనిచేయాలనుకుంటే ఎప్పుడో పొత్తు పెట్టుకునేవాళ్లమన్నారు. కవితలో ఇంత ఆవేదన ఉందని ఇవాళే తెలిసిందని.. ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేస్తానని తెలిపారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని పూర్తి విశ్వాసంతో ఉన్నట్టు చెప్పారు.

మన క్రాంతి KR TV
తెలంగాణ
epaper.krtvnews.com

# కశ్మీర్ సమస్యకు కారణం కాంగ్రెస్ కాదా?



హైదరాబాద్ , 29 మే( క్రాంతి న్యూస్ ):సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన ఇంకా కశ్మీర్ సమస్య అలాగే ఉంది అంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. కశ్మీర్ కి స్వతంత్రపతిపత్తి ఇచ్చి వివాదానికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీ కాదా? ఆనాడు ఇందిర గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీర్ ను స్వాధీనం చేసుకొని ఉంటే ఈనాడు భారత్ దేశానికి ఈ పరిస్థితి వచ్చి ఉండేదా ? అని నిలదీశారు. 370 ఆర్టికల్ ను రద్దుచేసి కశ్మీర్‌ని భారత దేశంలో అంతర్భాగం చేసిన ధీరుడు నరేంద్ర మోడీ అని.. మోడీ మీద విమర్శలు చేయడం సూర్యుని మీద ఉమ్మివేయడమనని తెలిపారు. ప్రపంచంలోనే నరేంద్ర మోడీ పెద్దన్న పాత్రను పోషిస్తున్నారని.. రష్యా ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆగాలని కోరుకున్న వ్యక్తి మోడీ అని కొనియాడారు. సమస్య పరిష్కరించడం ముఖ్యమని.. దేశ భద్రత పట్ల కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని దుయ్యబట్టారు.

ప్రాసకోసం, రాజకీయంకోసం మీరు మాట్లాడుతున్న మాటలు సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జైహింద్ పేరుతో సైనికుల కోసమని ర్యాలీ పెట్టి రాహుల్ గాంధీని ప్రధాని చేద్దాం అంటారు.. ఏం మాట్లాడుతున్నారో సోయి ఉండే మాట్లాడుతున్నారా? అని మండిపడ్డారు. ఢిల్లీలో వెళ్లి మోడీని పొగుడుతారు.. గల్లీలో వచ్చి తిడతారని విమర్శించారు.. కేంద్ర ప్రభుత్వ చేస్తున్న పనులపై మీ మంత్రులు కొనియాడతారు.. మీరేమో తిడతారు.. ఇదేనా మీ నైజం? అని తీవ్రంగా మండిపడ్డారు. మల్కాజ్గిరి ప్రజలు అప్పట్లో గుండెల్లో పెట్టుకొని గెలిపించారని అంటున్నారు. అందుకేనా వారికి గుండె కోతను మిగుల్చుతున్నారు? అని ఎద్దేవ చేశారు. అందుకేనా హైడ్రాను తీసుకువచ్చి మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న ప్రజల ఉసురు పోసుకుంటున్నారని, గుండెల్లో పెట్టుకుని.. అభిమానించినందుకేనా ఆత్మహత్యలు చేసుకొనేలా చేస్తున్నారని నిలదీశారు. రక్తాన్ని చెమటగా మలచి గెలిపిస్తే వారి రక్తాన్నే కళ్ళు చూస్తున్నారన్నారు. ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని.. మీకు ఓట్లు వేసి గెలిపించినందుకా? ప్రజల కన్నీళ్లు చూసి సంతోషపడుతున్నారన్నారు.

# కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతిపై

## కవిత దర్యాప్తు కోరాలి: ఎంపీ చామల



ఢిల్లీ, 29 మే( క్రాంతి న్యూస్ ):ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు. ఈరోజు కవిత వ్యాఖ్యలు దాన్ని నిజం చేశాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి కవిత అవసరం లేదని.. తమకు సమర్థమైన నాయకత్వం ఉందని.. తమ పార్టీలోకి కొత్త వాళ్లు అవసరం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడింది: బీర్ల ఐలయ్య

కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపాలని ఆయన చూసినట్లు బయటపడిందని అన్నారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు రావడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయడానికి ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయని చెప్పారు బీర్ల ఐలయ్య.

కేసీఆర్ ఎందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారో కవిత బయట పెట్టాలని బీర్ల ఐలయ్య కోరారు. కేటీఆర్ బండారాన్ని కవిత బయట పెట్టిందని చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి కవితను బయటకు పంపించడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లిని చూసి ఓర్వలేని కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలను ఎలా గౌరవిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో డీల్‌పైన బీఆర్ఎస్ కార్యకర్తలకు సమాధానం చెప్పాలని కోరారు. కుటుంబాన్ని చక్కపెట్టుకోలేని కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతారా అని బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం.. తెలంగాణలో మూడురోజులు వర్షాలు..!




హైదరాబాద్ , 29 మే( క్రాంతి న్యూస్ ):ఈ నెల 31 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు ఆదిలాబాద్ వరకు విస్తరించాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం పశ్చిమ బెంగాల్–బంగ్లాదేశ్ తీరాల వెంబడి గత మూడు గంటల్లో 20 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపు కదిలి తీవ్ర వాయుగండంగా మారిందని పేర్కొంది. ప్రస్తుతం సాగర్ ద్వీపానికి ఆగ్నేయంగా 60 కిలోమీటర్ల, దిఘాకు తూర్పు ఆగ్నేయంగా 110 కిలోమీట దూరం, బాలాసోర్‌కు 160 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. ఉత్తరం వైపు కదులుతూ సాగర ద్వీపం, ఖేపుపారా (బంగ్లాదేశ్) మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది.

అలాగే, ఆగ్నేయ రాజస్థాన్ నుంచి వాయువ్య బంగాళాఖాతం మీదుగా పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాలకు ఆనుకొని ఉత్తర మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, గంగానది, బెంగాల్ మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో వాయుగుండం కేంద్రం వరకు ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 5 నుంచి 7 డిగ్రీల వరకు తక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వానలు పడుతాయని పేర్కొంది. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.


జూన్ ఒకటిన కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాలో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. జూన్ 2న భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# అంగన్‌వాడీలకు సర్కార్ తీపికబురు.. వారి ఖాతాల్లోకి రూ.2 లక్షలు



హైదరాబాద్ , 29 మే( క్రాంతి న్యూస్ ): అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా వరాల జల్లు కురిపించింది. ఈ మేరకు అంగన్‌వాడీల పదవీ విరమణ ప్రయోజనాలను పెంచేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి రిటైర్ అయ్యే ప్రతి అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, అదేవిధంగా హెల్పర్‌కు రూ.లక్ష వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. అయితే, ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలపడంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఇదే విషయంపై సీఎం రేవంత్ రెడ్డి అధికారిక ప్రకటన చేయనున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పడానికి రెడీ అవుతున్నారు. వారు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ డియర్‌నెస్ అలవెన్స్ లలో ఒక దానని విడుదల చేసేందుకు సన్నద్ధమవుతోన్నట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే ఆర్థిక శాఖ సమీక్ష కూడా నిర్వహించినట్లుగా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ..



హైదరాబాద్, 29 మే( క్రాంతి న్యూస్ ):జూన్ మాసం వచ్చిందంటే చాలు.. తెలంగాణలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ హడావుడి మొదలవుతుంది. ప్రతి ఏడాది మృగశిర కార్తె సందర్భంగా జూన్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు.. ప్రతి ఏటా చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందుకోసం నగరంలోని వారే కాక రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనాలు హాజరవుతుంటారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ ఏడాది కూడా అలానే జరుగుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా గురువారం నాడు వారు మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా జూన్ 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ మొదలవుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. మరుసటి రోజు అనగా.. జూన్ 9, ఉదయం 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో దగ్గు, ఆస్తమా, దమ్ము, ఉబ్బసం, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారు వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని సూచించారు.

ఇక గతేడాది సుమారు 2.5 లక్షల మంది చేప ప్రసాదం తీసుకున్నారని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ సంవత్సరం ఈ సంఖ్య మరింత పెరిగి.. మూడు లక్షల మంది చేప ప్రసాదం తీసుకుంటారని అంచనా వేస్తున్నామన్నారు. చేప ప్రసాదం కోసం ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాక దేశ నలుమూలల, విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో జనాలు తరలి వస్తారని చెప్పుకొచ్చారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు బత్తిని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. మాస్కులు, గ్లౌస్‌లు ధరించి, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకుంటూ చేప ప్రసాదం పంపిణీ చేస్తామని వారు చెప్పుకొచ్చారు. అయితే చేప ప్రసాదం తీసుకున్న వారు 45 రోజుల పాటు ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. గర్భిణీ స్త్రీలు తప్ప అందరూ దీన్ని తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

చేపప్రసాదం కోసం తెలంగాణ మత్స్య శాఖ ఈ సంవత్సరం 1.25 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచనుందని తెలిపారు. అయితే పోయిన సంవత్సరం చేప ప్రసాదం కోసం వినియోగించే.. ఒక్కో చేపకు రూ. 40 చెల్లించామన్నారు. ఈ ఏడాది ధరపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అంతేకాక 200 మంది వాలంటీర్లు చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సాయం చేస్తారన్నారు. ప్రసాదం కోసం వచ్చే వారి కోసం పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత భోజనం అందించనున్నట్లు తెలిపారు.

# దేవుడిపైనే దండెత్తుతావా? కవితపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఫైర్



హైదరాబాద్ , 29 మే( క్రాంతి న్యూస్ ):కవిత చిట్ చాట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు స్పందించారు. కవిత మాట్లాడిన మాటలు క్షమించరానివి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయని అన్నారు. లేఖలోని అంశాలు బయటకు వచ్చిన తరవాత కేసీఆర్ సమాధానం ఇచ్చే వరకు వేచి చూడాలి కదా అన్నారు. ఆయన స్పందించిన తరవాత మాట్లాడాలని చెప్పారు. కానీ కవితకు అంత ఆవేశం ఎందుకు అని ప్రశ్నించారు. కొంచెం అయినా ఓపిక ఉండాలన్నారు.

కేసీఆర్ మీకే కాదు లక్షలాది మంది ప్రజలకు దేవుడు అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కాళేశ్వరం గురించి నోటీసులు వచ్చాయని దాని గురించి ఆలోచిస్తున్నారని అన్నారు. మరోవైపు కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వేధిస్తున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో ఏం కొంపలు అంటుకుపోయాయని కవిత ఆవేశపడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఎటు వెళతారు, అంశాలు ఎటు వెళతాయి అని ప్రశ్నించారు. లేఖలోని అంశాల గురించి కేసీఆర్ చూసుకుంటారని ఆయనను దేవుడు అని ఆయన ఆదేశాలు ఇచ్చేంతవరకు ఎందుకు ఆగడంలేదని మండిపడ్డారు. దేవుడి మీదనే దండెత్తుతావా? అంటూ రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏపీ హైకోర్టులో భారీగా పోస్టులు.. భర్తీకి ఉత్తర్వులు



అమరావతి , 29 మే( క్రాంతి న్యూస్ ):రాష్ట్ర హైకోర్టు లో పోస్టుల భర్తీకి మరోసారి సైతం అడుగులు పడ్డాయి. మొత్తం 245 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు చేశారు. అయితే మూడు పోస్టులు మాత్రం కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు జరగనున్నాయి. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని హైకోర్టు, ప్రభుత్వ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భర్తీ చేసేందుకు సిద్ధమయ్యారు. పోస్టుల పేర్లు, వివరాలు, అర్హత, వయోపరిమితి, జీతం, దరఖాస్తు ప్రక్రియ, ప్రారంభ, చివరి తేదీ, ఫీజు, ఎంపిక ప్రక్రియ వంటి వివరాలను ఆన్ లైన్‌లో ఉంచనున్నారు. కాగా ఇప్పటికే 1620 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ కొనసాగుతోంది. జూన్ 2తో ఈ గడువు ముగియనుంది. ఈ సమయంలో మరో నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు జరగుతున్నాయి. అర్హతలు కలిగిన నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ అధికారులు, మేధావులు పిలుపునిచ్చారు.

# 'ఇది దేవుడి స్క్రిప్ట్ అంటే'.. హోంమంత్రి అనిత సంచలన వ్యాఖ్యలు

కడప , 29 మే( క్రాంతి న్యూస్ ):కడప జిల్లాలో టీడీపీ మహానాడు మూడో రోజు(గురువారం) ఘనంగా జరుగుతుంది. నేటితో టీడీపీ మహానాడు ముగుస్తుండటంతో భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు, అభిమానులు తరలి వచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత కడప గడ్డపై ప్రతి కార్యకర్తకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కడప గడ్డ తెలుగు దేశం పార్టీ అడ్డా అని సీఎం చంద్రబాబు నిరూపించారని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు టీడీపీ మహానాడు వేదికగా హెూం మంత్రి అనిత ప్రసంగించారు.



రాబోయే 5 ఏళ్ల గురించి ఆలోచించే వారిని పొలిటికల్ లీడర్ అంటారు. 20 ఏళ్ల పాటు రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించేవాడిని విజనరీ లీడర్ అంటారు. ఆ విజనరీకి ఆరు అడుగుల నిలువెత్తు రూపమే సీఎం చంద్రబాబు అని ఆమె తెలిపారు. 75 ఏళ్ల వయసు 40 ఏళ్ల రాజకీయ అనుభవం చతురతతో 2047కి రాష్ట్రం ముందుండాలనే ఆశయంతో ఆయన కృషి చేస్తున్నారని హెూం మంత్రి అనిత వెల్లడించారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఉపాధి అవకాశాలు లేక యువత ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రౌడీ రాజకీయాలు చేస్తున్న సమయంలో.. ఒక బిడ్డ రోడ్డు పైకి వచ్చి.. తల్లిని అవమానించారు, తండ్రిని జైలుకు పంపించారు. అయిన అదరలేదు బెదరలేదని హెూంమంత్రి అనిత గుర్తు చేశారు. ఈ తరుణంలో యువగళం పేరుతో నేను చేయగలనని 9 నెలల కాలంలో పార్టీకి పునరుత్తేజం తెచ్చి, కూటమిని అధికారంలోకి తీసుకు వచ్చిన నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ మహానాడుకు ముందు వర్షం పడింది. దీంతో మహానాడు జరగదని వైసీపీ వాళ్ళు డ్యాన్సులు వేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ.. సీఎం చంద్రబాబు సంకల్పం ముందు అవన్ని దిగదుడుపే అని ఆమె తేల్చి చెప్పారు. ప్రకృతి సహకరించి ఇప్పుడు ఇంత చల్లగా ఆశీర్వదించింది. 'ఇది దేవుడి స్క్రిప్ట్ అంటే' అని ఆమె వైసీపీకి కౌంటర్ ఇచ్చారు. గత ఐదేళ్ల అనేక కేసులు పెట్టారని హెూం మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం చంద్రబాబు రాయలసీమలో ఫ్యాక్షన్ ను ప్రారదోలి కత్తిపట్టిన చేతికే ఉపాధి చూపించారని తెలిపారు.


రాయలసీమలో ప్రతి ఇంట్లో సీఎం చంద్రబాబు ఫొటో పెట్టుకోవాలి.. ఎందుకంటే నేడు రాయలసీమకు కియా, శ్రీ సిటీ, హీరో వంటి కంపెనీలు తెచ్చారు. నిన్న మహానాడులో లోకేష్ చేసిన 6 శాసనాలు 2047 కి ప్రధాన భూమిక పోషించబోతున్నాయి. ఇవే పునాదులు కాబోతున్నాయి. ఆరు శాసనాలను గ్రామ గ్రామాన వెళ్లి చెప్పే బాధ్యత మేం తీసుకుంటాం. 2047 విధానాలపై పని చేయండి. మళ్లీ ఐదేళ్ల తర్వాత నేను వస్తానని కలలు కనేవారికి ఫుల్ స్టాప్ పెట్టేద్దాం అని ఆమె తెలిపారు. 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే పని చేయాలని కోరుకుంటున్నానని హెూం మంత్రి అనిత పేర్కొన్నారు.

# గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా గిద్దలూరు, ఎర్రగుంట్ల




అమరావతి, 29 మే( క్రాంతి న్యూస్ ): రాష్ట్రంలో పలు నగర పంచాయతీలు, మున్సిపాలిటీల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పంచాయతీలుగా ఉన్న గిద్దలూరు, ఎర్రగుంట్లను గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా.. నరసరావుపేట, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలను గ్రేడ్ 1 మున్సిపాలిటీలుగా స్థాయి పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. తక్షణమే ఈ మార్పులు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ నోటిఫికేషన్లను జారీ చేశారు.

# ఏపీలో ఏనుగుల బీభత్సం.. అటవీశాఖ సిబ్బందికి గాయాలు



అమరావతి, 29 మే( క్రాంతి న్యూస్ ):ఏపీలోని తిరుపతి జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. జిల్లాలోని ఎర్రావారిపాలెం మండలంలో బోయపల్లి వద్ద అటవీశాఖ సిబ్బంది పై ఏనుగులు దాడి చేశాయి. ఈ దాడిలో ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, సెక్షన్ ఆఫీసర్ మునుస్వామి, గార్డు లక్ష్మీప్రసాద్‌కు గాయాలయ్యాయి. వెంటనే వీరిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఏనుగులు సమీప గ్రామాలకు వచ్చే అవకాశముందని, ఈ సందర్భంగా ఉస్తికాయలపెంట, కోటకాడపల్లి, యలమంద గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# మహానాడులో జలీల్ ఖాన్ కు అస్వస్థత



కడప , 29 మే( క్రాంతి న్యూస్ ): కడప మహానాడు లో ఓ టీడీపీ నేత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కడపలో జరుగుతున్న మహానాడు చివరి రోజుకు భారీగా టీడీపీ శ్రేణులు హాజరైన విషయం తెలిసిందే. అయితే ఈ సభలో టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యి, వేదికపైనే కుప్పకూలి పోయారు. దీంతో తక్షణమే ఆయనను టీడీపీ శ్రేణులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యంపై పలువురు నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీస్ థీమ్ యోగా.. పాల్గొన్న 5 వేల మంది పోలీసులు



అమరావతి, 29 మే( క్రాంతి న్యూస్ ):యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో పోలీస్ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. తనువు, మనసును ఏకం చేసి శరీరం మొత్తాన్ని స్వచ్ఛతతో నింపే దివ్య ఔషధం యోగా అని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. 26 జిల్లాల్లోనూ ప్రతిరోజూ ఒక ఇతివృత్తంతో ఉత్సాహంగా పండగ వాతావరణంలో యోగా కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు.

రైతులు, విద్యార్థులు, కార్మికులు ఇలా ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగం చేసే లక్ష్యంతోనే థీమ్ యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల సరళమైన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలోనూ ప్రతి పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాకు నాలుగు చొప్పున పర్యాటక ప్రాంతాల్లో యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.

విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో పోలీస్ థీమ్ యోగా కార్యక్రమంలో దాదాపు అయిదువేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్, సీసీఎల్ఏ, ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పాల్గొన్నారు.

# 'నా కళ్ళతో ఆయనను చూశా'.. YS షర్మిల ఆసక్తికర ట్వీట్



ఏపీ , 29 మే( క్రాంతి న్యూస్ ):వైఎస్ రాజారెడ్డి 100వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆసక్తికర ట్వీట్ పెట్టారు. వైఎస్ రాజారెడ్డి మా కుటుంబంలో మహెూన్నత వ్యక్తి. యెడుగూరి సందింటి వంశానికి శక్తి, మూలస్థంభం రెండూ ఆయనే. మా నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ని ప్రజా నాయకుడిగా, రాజకీయాల్లోనే దిగ్గజంగా తీర్చిదిద్దిన వ్యక్తి రాజారెడ్డి. అసమానమైన ధైర్య సాహసాలకు రాజారెడ్డి పెట్టింది పేరు. దృఢమైన విలువలతో తన ప్రజలకు ఆపదలో అండగా నిలిచారు. నా కళ్ళతో నేను ఆయనను చూశా. ఓర్పు మరియు ధైర్యం రాజారెడ్డి ఆయుధాలు. ప్రజల సమస్యలను వినడం, వాటిని పరిష్కరించడంలో నిక్కచ్చిగా నిలవడమే ఆయన తత్వం. రాజారెడ్డి ప్రజా నాయకుడు. ప్రజల ఆరోగ్యం బాగుండాలని ఆసుపత్రి కట్టించారు. బిడ్డలు పెద్ద చదువులు చదవాలని డిగ్రీ కాలేజీ, మహిళా కళాశాల, పాలిటెక్నిక్ కాలేజీ లాంటి విద్యాసంస్థలు కట్టించారు. ప్రజల మనిషిగా, ప్రజల గుండెలో శాశ్వత స్థానం సంపాదించే ఆయన వారసత్వం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఆయన ధైర్యం, క్రమశిక్షణ, న్యాయం పట్ల నిబద్ధత లాంటి అంశాలు ప్రజా సేవలో మా భవిష్యత్‌ను కూడా తీర్చిదిద్దాయి. రాజారెడ్డి చేసిన సేవ, అంకితభావం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని గర్వంగా చెబుతున్నాను' అని షర్మిల ట్వీట్‌లో పేర్కొన్నారు.

# రేషన్ షాపుల ద్వారానే నిత్యవసర వస్తువుల పంపిణీ..

విజయవాడ, 29 మే( క్రాంతి న్యూస్ ):బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకే రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ చేపడుతున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తామన్నారు. అందుకోసం దాదాపు 29,760 రేషన్ డిపోల ద్వారా ఈ పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. గురువారం విజయవాడ మధురానగర్‌లోని 218 రేషన్ షాపులో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపోస్ మిషన్‌తోపాటు ఎలక్ట్రానిక్ కాటా పని తీరును మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు ఆ శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ స్వయంగా పరిశీలించారు.



అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గతంలో రేషన్ వస్తువులను ఉదయం 8 నుంచి 12 గంటలు, సాయంత్రం 4 నుంచి 8 గంటల మధ్య పంపిణీ జరిగేదన్నారు. ఇలా గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో మాయ చేసిందంటూ ఆయన విమర్శించారు. దీని వల్ల రూ. వేల కోట్లు దుర్వినియోగం అయ్యేలా చేశారంటూ గత ప్రభుత్వంపై మండిపడ్డారు. దీంతో ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఈకేవైసీ 96 శాతం మేర పూర్తి చేశామని.. ఇది దేశంలోనే ఒక రికార్డు అని ఆయన పేర్కొన్నారు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి తమ ప్రభుత్వం స్వస్తి పలికామన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కోటి 46 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. జూన్ ఒకటి నుంచి 4. 40 లక్షల మందికి సరుకులు పంపిణీ చేయనున్నామన్నారు. మార్కెట్‌లో ధరలు పెరుగుదల ఉంటే.. సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా వాటిని ఇస్తామన్నారు. ప్రతి రేషన్ షాపు ఫొటో తీసి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచామని తెలిపారు. అన్ని షాపులకు ఈ సాయంత్రానికి సరుకులు చేరుతాయని వివరించారు. ఈపోస్ మిషన్, కాటా, సర్వీసింగ్ ఉచితంగా చేయిస్తున్నామని చెప్పారు. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించామన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు వారి వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అంద చేస్తామని తెలిపారు. అందుకు అన్ని విధాలా డీలర్లు ను కూడా సన్నద్ధం చేశాని చెప్పారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాలు సైతం రేషన్ షాపులు పని చేస్తాయని చెప్పారు. ఎం.డి.యూలు పది శాతం డబ్బులు కట్టారన్నారు. మిగతా నగదు కార్పొరేషన్ ద్వారా కట్టి.. వాహనాలు వారికే ఇస్తున్నామన్నారు. ప్రజలు కూడా రేషన్ షాపుల ద్వారానే సరుకులు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు.

ఈ 15 రోజుల్లో వారికి వీలున్న సమయాల్లో సరుకులు తెచ్చుకుంటారన్నారు. 29,760 రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ ఉంటుందని తెలిపారు. మార్కెట్‌లో పెరిగే వస్తువులను బట్టి.. రేషన్ షాపుల్లో తక్కువ ధరకే వాటిని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# కేటీఆర్ అసలు రంగు బయట పడింది : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, 29 మే( క్రాంతి న్యూస్ ):తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లోని రాజకీయ లుకలుకలు, కుటుంబ సంఘర్షణలు బయటికి వస్తున్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తమ పార్టీని బీజేపీ తో కలపాలని చూస్తున్నారని.. ఆది తనకు ఏమాత్రం ఇష్టం లేదని కవిత రాజకీయ బాంబ్ పేల్చారు. తాను ఉంటే కుదరదని, తనను పార్టీ నుంచి బయటకు పంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన కవిత.. పార్టీలో కేసీఆర్ నాయకత్వం తప్పా ఎవ్వరి నాయకత్వం తాను ఒప్పుకోబోనని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కేటీఆర్ అసలు రంగు నేడు బయట పడిందన్నారు. సొంత చెల్లినే పార్టీలో తొక్కేయాలని కేటీఆర్ చూస్తున్నారని తెలిపారు. కుటుంబంలో ఉన్న సవాళ్లకే సమాధానం చెప్పలేకపోతే, ఆయన ప్రజలకు ఏం చేయగలడని ప్రశ్నించారు. ట్విట్టర్లో కాదు.. బయటకు వచ్చి మాట్లాడాలని కేటీఆర్ కు కవిత సవాల్ విసిరిందని, కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్..!



హైదరాబాద్ , 29 మే( క్రాంతి న్యూస్ ): యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల బైక్‌పై పాకిస్తాన్ టూర్‌కు వెళ్లిన సన్నీ యాదవ్‌ను చెన్నై విమానాశ్రయంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్తాన్ టూర్ వివరాలను ఎన్ఐఏ అధికారులు సేకరిస్తున్నారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో యూ ట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్, అంతర్జాతీయ బైక్ రైడర్ బయ్యా సన్నీ యాదవ్‌పై సూర్యాపేట జిల్లా పోలీసులు లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల విషయంలో ఈ ఏడాది మార్చి 5న సూర్యాపేట జిల్లా నూతనకల్ పోలీసు స్టేషన్‌లో సన్నీ యాదవ్‌పై కేసు నమోదైంది.

విచారణలో భాగంగా సన్నీ యాదవ్ విదేశాల్లో ఉన్నట్లు నాడు పోలీసులు గుర్తించారు. సన్నీ యాదవ్ వాఘా సరిహద్దు గుండా పాకిస్తాన్ దేశంలోకి వెళ్లినట్లు పోలీసులు అనుమానించారు. పాకిస్తాన్ బైక్ టూర్‌ను పూర్తి చేసినట్లు ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సన్నీ యాదవ్ తిరిగి ఇండియాకు రాగా, చెన్నై ఎయిర్‌పోర్టులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

# పోలీసుల అదుపులో మావో కీలక నేత హిడ్మా

ఒడిశా, 29 మే( క్రాంతి న్యూస్ ):ఏవోబీలో కీలక నేత కుంజం హిడ్మా అరెస్ట్ అయ్యారు. కొరాపూట్‌లో హిడ్మాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఏకే 47తో పాటు పలు పేలుడు పదార్థాలకు సంబంధించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇక మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషర్ కగార్ కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత ఆపరేషన్ కగార్ మరింత దూకుడుగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఏవోబీ ప్రాంతంవైపు కూడా పెద్ద ఎత్తున దృష్టిసారించారు భద్రతా బలగాలు.




ముఖ్యంగా ఒడిశాలో కొన్ని ప్రాంతాల నుంచి భారీగా పేలుడు పదార్థాలును తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ వర్గాల సమాచారంలో పక్కా పథకం ప్రకారం హిడ్మాను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను దండకారణ్యంవైపు తీసుకెళ్తున్నారంటూ హిడ్మాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఏవోబీకి సంబంధించి ఆపరేషన్ కగార్‌లో పెద్ద ఎత్తున కీలక నేతలంతా నేలరాలుతున్నారు. గత సంవత్సర కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. అనేమార్లు భద్రతా బలగాలతో మావోయిస్టుల ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అనేక మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.

మావోయిస్టు కీలక నేతలు కూడా ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. చాలా కాలంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల వద్ద ఉన్న ఆయుధాలు కూడా పూర్తి స్థాయిలో అడుగంటిన పరిస్థితి. పేలుడు పదార్థాలు, జిలిటెన్ స్టిక్స్, బాంబులకు సంబంధించిన ఎక్స్‌పోసివ్ మెటీరియల్ మొత్తం మావోయిస్టుల వద్ద అడుగంటినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో పేలుడు పదార్థాలను ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి రవాణా చేస్తున్న సమయంలోనే మావోయిస్టు కీలక నేత హిడ్మాను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేశారు.

# హై లెవల్ బ్రిడ్జికి మంత్రి సీతక్క శంకుస్థాపన

కొత్తగూడెం సింగరేణి: , 29 మే( క్రాంతి న్యూస్ ): పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లికి వెళ్లే రోడ్డు 0/600 వద్ద రూ.6.50 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలోని పలు గ్రామాలకు రహదారులు, వంతెనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

కిశోర బాలికలకు ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభించిన మంత్రి సీతక్క

రాష్ట్రంలో మొదటిసారిగా జిల్లాలో కిశోర బాలికలకు ఇందిరమ్మ అమృతం అందించి పథకాన్ని మంత్రి సీతక్క ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో ఇందిరమ్మ అమృతం పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఒకప్పుడు అంగన్వాడి కేంద్రాలు కేవలం పిండి పంపిణీ చేసేందుకు మాత్రం పనిచేసేవి కానీ నేడు ఇందిరమ్మ ప్రభుత్వంలో అంగన్వాడీ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉన్నాయన్నారు. అంగన్వాడి పాఠశాలలు పూర్వ ప్రాథమిక విద్యాలయాలుగా మారాయి అన్నారు.అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలకు అనేక జబ్బులు వస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.



# ‘ఒక్కసారి కమిటైతే నా మాట నేనే వినను’.. వాయుసేన దళపతి డైలాగ్‌కు చప్పట్లు

ఇంటర్నెట్‌డెస్క్, 29 మే( క్రాంతి న్యూస్ ): ‘ఆపరేషన్ సిందూర్’ ను పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించినట్టు ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడించారు. యుద్ధంలో ఆధునిక సాంకేతికత, స్వదేశీ పరిజ్ఞాన వినియోగం గురించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్య చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక సినిమా డైలాగ్ వాడటంతో సభా ప్రాంగణం అంతా చప్పట్లతో మారుమోగింది. గురువారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

స్వదేశంలో తయారు అయిన రక్షణ సామగ్రిని వినియోగించాలని భారత్ దృఢ సంకల్పంతో ఉందని వాయుసేన దళపతి అన్నారు. అప్పుడే.. ‘ఒక్కసారి కమిటైతే నా మాట నేనే వినను’ అని ఒక ఫేమస్ సినిమా డైలాగ్‌ను ప్రస్తావించారు. “రక్షణరంగానికి చెందిన పరికరాలు తయారు చేసే కంపెనీలకు, బలగాలకు మధ్య పరస్పర అవగాహన ఉండాలి. మేకిన్ ఇండియా ఉత్పత్తుల వాడకాన్ని పెంచడానికి మేం మావంతు ప్రయత్నిస్తున్నాం” అని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశ విజయం అని తెలిపారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి భారతీయుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే సమావేశంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



మాట్లాడారు. ఆయన కూడా స్వదేశీ తయారీ గురించే మాట్లాడారు. పీఓకే గురించి ప్రస్తావించారు.

“భౌగోళికంగా విడిపోయినా పీవోకే ప్రజలు రాజకీయంగా ఏదో ఒకరోజు భారత్‌లో ఏకమవుతారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు. పీఓకే దానంతట అదే తిరిగి వస్తుంది. అక్కడున్నవారికి భారత్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. గ్రేట్ ఇండియా మా సంకల్పం. అక్కడ కొందరు మాత్రమే తప్పుదారి పట్టారు. మనం ఏమైనా చేయగలిగేవాళ్లం. అయితే శక్తితో పాటు సంయమనం కూడా ముఖ్యం. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశభద్రతకు మేకిన్ ఇండియా ముఖ్యమని రుజువైంది” అని అన్నారు.


# పాక్‌తో గూఢచర్యం.. మాజీ మంత్రి పీఏ అరెస్ట్




ఇంటర్నెట్ డెస్క్ , 29 మే( క్రాంతి న్యూస్ ): భారత్‌లో ఉంటూ కొంతమంది పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు దేశద్రోహులు పట్టుబడగా వారిని అధికారులు విచారిస్తున్నారు. కాగా తాజాగా మరో గూఢచారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి మరియు ఓ రాజకీయ పార్టీ నేత మాజీ పీఏ సకూర్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్టు ఇంటిలిజెన్స్ అధికారులు వెల్లడించారు. అతడు ఆరేడుసార్లు పాకిస్థాన్ వెళ్లి వచ్చాడని తెలిపారు. అధికారులు సకూర్ ఖాన్ మొబైల్ ఫోన్ తనిఖీ చేయగా అందులో పాకిస్థానీ ఫోన్ నంబర్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ నంబర్ల గురించి సకూర్ ఖాన్ సరైన సమాధానాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. ఖాన్ ఫోన్‌లో సైనిక రహస్య సమాచారం లభించనప్పటికీ కొన్ని ఫైళ్లను డిలీట్ చేసినట్టు అధికారులు తెలిపారు. అతడికి సంబంధించిన బ్యాంకు ఖాతాలపై కూడా అధికారులు దృష్టి సారించారు.

## కాళ్ళలో నొప్పితోపాటు
## ఈ సంకేతాలు కనిపిస్తున్నాయా..?

హెల్త్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది గుండె జబ్బుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. గుండె సంబంధిత వ్యాధులు ప్రాణాంతకం మాత్రమే కాదు, జీవన నాణ్యతపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అయితే, దాని ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రారంభ దశల్లో వ్యాధిని నివారించడానికి అనేక





చికిత్సా ఎంపికలు అందుబాటులో ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండె జబ్బులను నివారించడానికి, సకాలంలో తనిఖీ చేయించుకోవడం.. లక్షణాలను విస్మరించకుండా ఉండటం చాలా ముఖ్యం. అటువంటి ప్రక్రియలలో యాంజియోప్లాస్టీ ఒకటి. యాంజియోప్లాస్టీ అనేది ప్రాణాలను కాపాడటమే కాకుండా జీవిత నాణ్యతను కూడా మెరుగుపరిచే ప్రభావవంతమైన చికిత్సలలో ఒకటి. ఇది ప్రత్యేకంగా కరోనరీ ఆర్టరీ వ్యాధి చికిత్సలో ఉపయోగించబడుతుంది.. దీనిలో ధమనులు ఇరుకైనవి లేదా మూసుకుపోతాయి.. గుండెకు రక్త సరఫరా అడ్డంకిగా మారుతుంది.

ఇది ఒక చిన్న శస్త్రచికిత్స.. దీనిలో ధమనిని తెరవడానికి బెలూన్ ఉపయోగించబడుతుంది.. దానిని తెరిచి ఉంచడానికి స్టెంట్ అని పిలువబడే ఒక చిన్న వైర్ మెష్ ట్యూబ్ ఉంచుతారు.. ఇలా యాంజియోప్లాస్టీ ప్రక్రియ ద్వారా.. రోగి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తారు.

యాంజియోప్లాస్టీ ఎప్పుడు అవసరం?

కరోనరీ ఆర్టరీలో అడ్డంకులు ఏర్పడి రక్తం గుండెకు సరిగ్గా చేరలేనప్పుడు యాంజియోప్లాస్టీ చేస్తారు. దాని అవసరాన్ని తెలుసుకోవడానికి, యాంజియోగ్రామ్, ఒత్తిడి పరీక్ష.. ECG వంటి కొన్ని పరీక్షలు చేస్తారు.

గుండె నొప్పి సమయంలో.. మీకు యాంజియోప్లాస్టీ అవసరమా? లేదా..? ఇలా గుర్తించండి..

ఛాతీ నొప్పి: మీరు తరచుగా మీ ఛాతీలో మంటగా లేదా ఒత్తిడిగా అనిపిస్తే, అది గుండె ధమనులలో అడ్డంకికి సంకేతం కావచ్చు. అటువంటి సందర్భాలలో, తీవ్రమైన సందర్భాల్లో యాంజియోప్లాస్టీ చేయబడుతుంది. అడ్డంకులను తొలగించడం ద్వారా, గుండెకు రక్త సరఫరా మెరుగుపడుతుంది.

కాళ్ళలో నొప్పి: గుండె జబ్బుల ప్రభావాలు కాళ్ళను కూడా తాకవచ్చు. నడుస్తున్నప్పుడు లేదా సైక్లింగ్ చేస్తున్నప్పుడు కండరాల తిమ్మిరి, నొప్పి సంభవించవచ్చు. ఇది పరిధీయ ధమని వ్యాధి (PAD) కి సంకేతం.. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని సూచిస్తుంది.


బలహీనత – అలసట: మీరు ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపిస్తే, ముఖ్యంగా తక్కువ శ్రమ తర్వాత లేదా మెట్లు ఎక్కిన తర్వాత, ఇది గుండె జబ్బుల లక్షణం కావచ్చు. అటువంటి పరిస్థితిలో, వైద్యుడు చెకప్ తర్వాత యాంజియోప్లాస్టీ చేయించుకోవాలని సలహా ఇవ్వవచ్చు.. ఇది రక్త సరఫరా మెరుగుపడినప్పుడు శక్తి స్థాయిని పెంచుతుంది.

రక్తపోటులో హెచ్చుతగ్గులు: నిరంతర అధిక రక్తపోటు గుండె ధమనులను గట్టిగా.. మందంగా చేస్తుంది. దీనివల్ల గుండెపోటు – స్ట్రోక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో, వైద్యుడు అడ్డంకిని తొలగించడానికి యాంజియోప్లాస్టీని సిఫారసు చేయవచ్చు.

చిగుళ్ళలో రక్తస్రావం: చిగుళ్ల వ్యాధికి, గుండె జబ్బులకు మధ్య సంబంధం ఉంది. అటువంటి పరిస్థితిలో, మీ చిగుళ్ళు తరచుగా ఉబ్బితే లేదా రక్తస్రావం అయితే, అది గుండె ఆరోగ్యానికి సంబంధించిన హెచ్చరిక కావచ్చు.

కావున ఇలాంటి లక్షణాలు కనిపిస్తే.. వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలి.. లేకపోతే.. కొన్ని సార్లు ప్రాణాంతకం కావొచ్చు..

## ఈ నట్స్‌ను ఎప్పుడైనా చూశారా..?
## అనేక అద్భుతాలు చేస్తాయి..



హెల్త్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): నట్స్.. ఈ పేరు చెప్పగానే మనకు బాదం, జీడిపప్పు, వాల్ నట్స్ గుర్తుకు వస్తాయి. కానీ మనకు తెలియని ఇంకా ఎన్నో రకాల నట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మెకడేమియా నట్స్ కూడా ఒకటి. ఇవి వెన్న రుచిని కలిగి ఉంటాయి. క్రీమ్ లాగా అనిపిస్తాయి. ఎంతో రుచిగా ఉండడమే కాదు అనేక పోషకాలను కూడా అందిస్తాయి. మెకడేమియా నట్స్‌లో క్యాలరీలు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మెకడేమియా నట్స్‌లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఈ కొవ్వులు మన శరరీంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

ఆర్థరైటిస్ ఉన్నవారికి..

మెకడేమియా నట్స్‌లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నట్స్ మేలు చేస్తాయి. మెకడేమియా నట్స్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్లేవనాయిడ్స్, టోకోట్రియనోల్స్ జాబితాకు చెందుతాయి. అలాగే ఈ నట్స్‌లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇవన్నీ శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల క్యాన్సర్, దయాబెటిస్, నాడీ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

మెదడు పనితీరుకు..

మెకడేమియా నట్స్‌లో ఒమెగా 7 తోపాటు ఒమెగా 9 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. చిన్నారులు అయితే చురుగ్గా పనిచేస్తారు. మెదడు యాక్టివ్‌గా మారి చదువుల్లో రాణిస్తారు. తెలివితేటలు పెరుగుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు ఉన్నవారు ఈ నట్స్‌ను తింటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ నట్స్‌ను తినడం వల్ల మూడ్ మారుతుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది.

బరువు తగ్గేందుకు..

అధిక బరువు ఉన్నవారికి ఈ నట్స్‌ను వరం అనే చెప్పవచ్చు. ఈ నట్స్‌లో క్యాలరీలు, కొవ్వులు అధికంగా ఉన్నప్పటికీ ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువు తగ్గేలా చేస్తాయి. రోజూ గుప్పెడు మెకడేమియా నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుందని, అధిక బరువు తగ్గుతారని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో తేలింది. ఈ నట్స్ వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడి కొవ్వు కరుగుతుంది. ఫలితంగా బరువు తగ్గి నియంత్రణలో ఉంటుంది. మెకడేమియా నట్స్‌ను తింటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. దయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మెకడేమియా నట్స్ వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## పాలన్నం తింటే ఇన్ని లాభాలా..? ఎన్ని పోషకాలో ..

హెల్త్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): పాలు, బియ్యం మిశ్రమం పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. పాలతో అన్నం వండుకుని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరానికి వివిధ ప్రయోజనాలు లభిస్తాయి. మిల్క్ రైస్ తయారు చేయడం కూడా చాలా సులభం. అందువల్ల రోజుకు కనీసం ఒక్కసారైనా పాల రైస్ తీసుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఇలా పాలతో తయారు చేసిన అన్నాన్ని తినవచ్చు.

పాలు, బియ్యం మిశ్రమం బలపరుస్తాయి. పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. శరీరానికి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి, విటమిన్ బి12 ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాలు, కండరాలు, నరాలను కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి, ఉంటారని నిపుణులు చెబుతున్నారు



బియ్యంలో ఇవి శక్తికి మూలం. పాలతో కలిపి తింటే అవి మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తాయి. పాలల్లో అన్నం వేసుకుని తినడం కొందరికి చాలా ఇష్టం. పాలు, రైస్ కలిసిన ఆహారం తింటే శరీరానికి తక్షణ శక్తి వస్తుంది. ఉదయాన్నే ఇలాంటి ఆహారం తింటే రోజంతా శక్తివంతంగా

పాలన్నం తినడం వలన జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాదు, ఎక్కువ సమయం పాటు కడుపు నిండుగా ఉంటుంది. దీంతో తరచూ తినాలనే కోరిక తగ్గుతుంది. ఫలితంగా బరువు తగ్గేందుకు కూడా దోహదం చేస్తుంది. పాలన్నంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పాలు, బియ్యం శరీరానికి త్వరిత శక్తిని అందిస్తాయి. పాలు, బియ్యం సులభంగా జీర్ణమవుతాయి. పాలన్నంలో ఉన్న కార్బోహైడ్రేట్లు శక్తి, శారీరక ఆరోగ్యాన్ని మెరుగు పరిచేలా చేస్తుంది.

# కొడుకు జొరావర్‌కు శిఖర్ ధావన్ ఎమోషనల్ మెసేజ్..

## ఇలాంటి పరిస్థితి ఎవరికీ రావొద్దంటోన్న ఫ్యాన్స్

స్పోర్ట్స్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): భారత క్రికెటర్ శిఖర్ ధావన్ తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి తరచుగా బహిరంగంగానే మాట్లాడుతుంటాడు. తన కుమారుడు జొరావర్‌తో దూరంగా ఉండటం వల్ల కలిగే మానసిక వేదనను ఆయన పలు సందర్భాల్లో పంచుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఒక పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, జొరావర్‌కు తండ్రిగా ఒక ముఖ్యమైన సందేశాన్ని అందించాడు. ఈ సందేశం ఎంతో భావోద్వేగభరితంగా సాగింది.



"నువ్వు తెలుసుకోవాల్సింది ఒక్కటే.. తండ్రి ఎప్పుడూ నీతోనే..!"

రానున్న 20 సంవత్సరాల తర్వాత జొరావర్ 31-32 ఏళ్ల వయసులో ఉంటాడని శిఖర్ ధావన్ ఆ పోడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. అప్పుడు తన కుమారుడికి తాను చెప్పదలుచుకున్న విషయం ఒక్కటే అని, అది "నువ్వు ఏది చేసినా సంతోషంగా ఉండు. సంతోషంగా ఉండటానికి మార్గం నీలోపల వెతుక్కోవడమే. నీ లోపల ఉన్న లోపాలను గుర్తించు, నీ బలాన్ని తెలుసుకో, వాటిని మెరుగుపరచుకో. అంతే, నువ్వు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ శిఖర్ ధావన్ తెలిపాడు.

తన కుమారుడు జొరావర్ తనతో ఇప్పుడు మాట్లాడటం లేదని, అయితే తాను ఆధ్యాత్మికంగా అతనితో కనెక్ట్ అయి ఉన్నానని శిఖర్ ధావన్ గతంలో కూడా వెల్లడించాడు. తాను జొరావర్‌ను కౌగిలించుకుంటున్నట్లు, ప్రేమను పంచుకుంటున్నట్లు భావిస్తున్నానని ఆయన చెప్పుకొచ్చాడు. జొరావర్ తనతో ఉండాలనుకుంటే, తాను ఎప్పుడూ అతని కోసం ఉంటానని ధావన్ భావోద్వేగంగా తెలిపాడు. ఇది తండ్రిగా తన బాధ్యత అని ఆయన అన్నాడు.


దూరం చేసిన విడాకులు..

శిఖర్ ధావన్, అయేషా ముఖర్జీల మధ్య 2023లో విడాకులు మంజూరయ్యాయి. విడాకుల సమయంలో ఢిల్లీ కోర్టు అయేషా చేసిన "మానసిక క్రూరత్వం" కారణంగా ధావన్‌కు విడాకులు ఇచ్చింది. అయితే, జొరావర్ కస్టడీ అయేషా వద్దనే ఉంది. ధావన్‌కు పరిమితమైన సందర్శన హక్కులు, వీడియో కాల్స్ ద్వారా సంభాషించే అవకాశం మాత్రమే లభించింది. ఈ పరిమితుల కారణంగా, ధావన్ తన కుమారుడిని కలవడానికి, అతనితో మాట్లాడటానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఈ పరిస్థితిలో శిఖర్ ధావన్ పడుతున్న బాధను అతని మాటలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. తన కుమారుడికి తండ్రి ప్రేమను పంచుకోవడానికి ఆయన తపిస్తున్న తీరు అందరినీ కదిలిస్తోంది. క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో అభిమానుల హృదయాలను గెలుచుకున్న ధావన్.. వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొంటున్న ఈ సవాలును కూడా మానసిక ధైర్యంతో ఎదుర్కొంటున్నాడు. జొరావర్ ఎప్పటికీ తన గుండెల్లోనే ఉంటాడని, తన ప్రేమ ఎప్పుడూ తన కుమారుడికి ఉంటుందని శిఖర్ ధావన్ సందేశం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది.

# భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు.. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు పటిష్ట భద్రత

స్పోర్ట్స్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు వేదికైన ముల్లాన్‌పూర్‌లో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా త్రివిధ దళాలు పాక్‌లోని ఉగ్రశిబిరాలపై దాడితో పోలీసులు మ్యాచ్ కోసం భారీ భద్రత కల్పించారు. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు చూసేందుకు దేశం నలుమూలల నుంచి ప్రేక్షకులు వచ్చే అవకాశముందని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశామని పంజాబ్ స్పెషల్ డీజీపీ అర్పిత్ శుక్లా పేర్కొన్నారు. 65 మంది ఉన్నతాధికారులకు తోడు 2,500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



# క్రికెట్ పిచ్‌పైనే ఫైటింగ్.. బంగ్లా బ్యాటర్‌పై సౌతాఫ్రికా బౌలర్ అటాక్..



స్పోర్ట్స్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా ఎమర్జింగ్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో ప్లేయర్లు ఘర్షణ పడ్డారు. ఢాకాలో రెండు జట్ల మధ్య నాలుగు రోజుల మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. మైదానంలోనే ఇద్దరు ప్లేయర్లు గొడవకు దిగారు. బంగ్లా బ్యాటర్ రిపన్ మోండల్‌పై .. సౌతాఫ్రికా పేస్ బౌలర్ షిపో నులి చేయిచేసుకున్నాడు. పిచ్‌పై వాగ్వాదానికి దిగారు. బంగ్లా బ్యాటర్‌కు సఫారీ బౌలర్ పంచ్ ఇచ్చాడు. ఫీల్డ్ అంపైర్‌తో పాటు మిగితా ఆటగాళ్లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బంగ్లా బ్యాటర్‌పై మరో దక్షిణాఫ్రికా ఫీల్డర్ దూసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం ఆటగాళ్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మ్యాచ్ అధికారులు త్వరలో రిపోర్టును సమర్పించనున్నారు.

ఓ క్రికెట్ వెబ్‌సైట్ ప్రకారం.. నులి బౌలింగ్‌లో స్ట్రెయిట్ సిక్సర్ కొట్టాడు రిపన్. దీంతో ఆ ఇద్దరు ఒకరిపై ఒకరు చూపులు విసురుకున్నారు. ఆ తర్వాత బ్యాటింగ్ పార్ట్నర్, నాన్ స్ట్రయికర్ వద్దకు బ్యాటర్ వెళ్లాడు. ఆ సమయంలో బంగ్లా బ్యాటర్ మీదకు సౌతాఫ్రికా బౌలర్ దూసుకువచ్చాడు. ఏదో మాటలు అనుకుని, ఒకర్ని ఒకరు తోసేసుకున్నారు. ఆ తర్వాత ఆ గొడవ పెద్దగా మారింది. బ్యాటర్ రిపన్ హెల్మెట్‌ను బౌలర్ నులి లాగేశాడు. ఆ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది.

# 'శ్రేయస్ ఏమి తప్పు చేశాడు.. కావాలనే ఎంపిక చేయలేదు'

స్పోర్ట్స్ న్యూస్ ,29 మే( క్రాంతి న్యూస్ ): ఐపీఎల్-2025 సీజన్ ముగిసిన వెంటనే భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లీష్ జట్టుతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తలపడనుంది. జూన్ 20 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది.



భారత టెస్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అదేవిధంగా టీమిండియా టెస్టు వైస్ కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ నియమితుడయ్యాడు. అయితే ఈ జట్టులో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

శ్రేయస్ అయ్యర్ స్థానంలో యువ ఆటగాడు సాయి సుదర్శన్‌కు సెలక్టర్లు చోటిచ్చారు. తాజాగా సెలక్టర్ల నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. సుదర్శన్ బదులుగా అనుభవం ఉన్న అయ్యర్‌కు ఛాన్స్ ఇవ్వాల్సిందని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

"సాయి సుదర్శన్ ఒక అద్భుతమైన ఆటగాడు, అందులో ఎటువంటి సందేహం లేదు. ఐపీఎల్ సీజన్‌లో బాగా రాణించడంతో అతడిని టెస్టు జట్టులోకి తీసుకున్నారు. అదే సమయంలో శ్రేయస్ అయ్యర్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. గత కొంతకాలంగా మూడు ఫార్మాట్లలోనూ అతడు నిలకడగా రాణిస్తున్నాడు.

వన్డే ప్రపంచ కప్-2023, ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అయ్యర్ దాదాపు 550 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో కూడా అద్భుతంగా ఆడుతున్నాడు. కెప్టెన్‌గా అతడు విజయవంతమయ్యాడు. సుదర్శన్‌ను వైట్ క్రికెట్ ప్రదర్శన ఆధారంగా టెస్టు జట్టులోకి తీసుకున్నప్పుడు, మరి అయ్యర్ విషయంలో ఏమైందని" సెలక్టర్లపై కైఫ్ మండిపడ్డాడు.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుదంర్, శార్దుల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్

# సినిమా న్యూస్




## నా స్క్రీన్‌ప్లేకి కారణం ఉపేంద్ర సినిమాలే!




'ఎప్పటికప్పుడు ప్రేక్షకుల్ని ఆశ్చర్య పరచడం ఉపేంద్ర అలవాటు. ఆయన తీసిన 'ఓం', 'ఏ', 'ఉపేంద్ర'... సినిమాలే ఇప్పుడు నా స్క్రీన్‌ప్లే ఇలా ఉండటానికి కారణం" అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. ఆయన, ఉపేంద్ర ముఖ్య అతిథులుగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'సీతాపయనం' టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రముఖ నటుడు అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన చిత్రమిది. ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రని పోషించారు. శ్రీరామ్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తోంది. టీజర్ ఆవిష్కరణ అనంతరం సుకుమార్ మాట్లాడుతూ "నేను సహాయ దర్శకుడిగా ఉన్నప్పుడే అర్జున్ సర్జాని దగ్గర నుంచి చూశా. ఆయన కూల్‌గా ఉంటారు. ఇప్పటికీ అలాగే ఉన్నారు. అర్జున్, ఉపేంద్రతో కలిసి ఈ వేదికని పంచుకోవడం ఆనందంగా ఉంది" అన్నారు. ఉపేంద్ర మాట్లాడుతూ "అర్జున్ అంటే భారతదేశంలో ఓ బ్రూస్‌లీతో సమానం. కన్నడ, తమిళ, తెలుగు.. ఇలా ఆయన అప్పట్లోనే పాన్ ఇండియా స్టార్" అన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్ సర్జా, చంద్రబోస్, అనూప్ రూబెన్స్, కథానాయకుడు నిరంజన్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



## ఖలేజా సినిమాను మహేశ్ బాబు అభిమానులే చంపేశారు..





మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఒకటి ఖలేజా . త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీరిలీజ్ కానుంది. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెఫరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీరిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది. ఖలేజా రీరిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన బోల్డ్ కామెంట్స్ ప్రస్తుతం నెట్టంట రౌండప్ చేస్తున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు.

బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీరిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ఆకాశాన్ని ఎంతకని వెలకడతారు?

రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటించిన ప్రతిష్టాత్మక పానిండియా జానపద చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఎ.దయాకర్‌రావు నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఈ సినిమాలోని మూడు పాటల్ని మేకర్స్ విడుదల చేయగా, చెన్నైలో ఘనంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సినిమాలోని నాలుగో గీతాన్ని విడుదల చేశారు. కథానాయిక నిధి అగర్వాల్, సమర్పకుడు ఏ.ఎం.రత్నం, దర్శకుడు జ్యోతికృష్ణ, నటులు సత్యరాజ్, నాజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినిమా విజయం పట్ల వారంతా నమ్మకం వెలిబుచ్చారు. ఇక పాట విషయానికొస్తే.. 'తార తార నా కళ్లు.. వెన్నెల పూత నా ఒళ్లు.. ఆకాశాన్ని ఎంతకనీ వెలకడతారు.' అంటూ సాగిన ఈ గీతాన్ని శ్రీహర్ష రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ అలపించారు. పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ పాట ప్రేక్షకులకి కొత్త అనుభూతిని కలిగించేలా ఉంది. రాజుల కాలంనాటి వాతావరణాన్ని ఈ పాటలో అద్భుతంగా ఆవిష్కరించారు.

## విడుదల తేదీ ప్రకటించిన రవితేజ 'మాస్ జాతర'





మాస్ మహారాజా రవితేజ ఇటీవల కాలంలో సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 'ధమాకా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో, రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'.

ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో 'ధమాకా'తో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనదే ఇదంతా' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా.. ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

ఈ సినిమాలో రవితేజ క్లాసిక్ పాటలలో ఒకటైన ఇడియట్ సినిమాలోని చూపులతో గుచ్చి గుచ్చి చంపకే పాటను ఇందులో రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇక టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.

## కుమార్తెను కాపాడుకునేందుకు ఓ తల్లి యుద్ధం.. 'మా'




కాజోల్ కీలక పాత్రలో నటిస్తున్న సూపర్ నేచురల్ ఫిల్మ్ 'మా' . విశాల్ ఫురియా దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. దెయ్యం బారిన పడిన తన కుమార్తెను కాపాడుకునేందుకు ఓ తల్లి చేసిన యుద్ధమే ఈ కథ అని చిత్ర బృందం చెబుతోంది. అందుకు తగినట్లుగానే ఆద్యంతం ఉత్కంఠ కలిగించే సన్నివేశాలతో సినిమా తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. తనూజ దేవ్‌గణ్, రోనిత్‌రాయ్, సుభద్ర సేన్‌గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీని అజయ్ దేవ్‌గణ్, జ్యోతి శాంతా సుబ్బరాయన్ నిర్మిస్తున్నారు.

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com